క్లుప్తంగా

ఏపీఎస్పీఎఫ్ సిబ్బందికి నేత్ర వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఏపీఎస్పీఎఫ్ సిబ్బందికి నేత్ర వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణదళం డైరెక్టర్ జనరల్ సి.త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి, కమాండెంట్ ఎం.శంకరరావు పర్యవేక్షణలో వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది 100మందికి వివిధ రకాల కంటి పరీక్షలు చేశారు. క్యాటరాక్ట్, తదితర మేజర్ సమస్యలు ఉన్న వారిని వైద్యశాలకు సిఫార్సు చేశారు. అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్స్ అందజేశారు.

238 మందికి నేత్ర వైద్య పరీక్షలు

మైలవరం: ఉచిత కంటి వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ నరసింహస్వామి అన్నారు. మైల వరం తపాలా కార్యాలయంలో శనివారం తపాలా శాఖ ఆధ్వర్యంలో అయాన్ ఐ హాస్పిటల్ సహకారంతో 238 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

హెచ్‌ఎం సీతాదేవికి సన్మానం

ఆగిరిపల్లి: మనిషి జీవితంలో గురువుల పాత్ర విశిష్టమైందని ఎంఈఓ-1 సర్వేశ్వరరావు అన్నారు. ఈదులగూడెంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని సీతాదేవి పదవీ విరమణ సందర్భంగా ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. ఆమెను పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ ఎం.సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం జరిగిన సమావేశంలో నియమావళికి సంబంధించి పలు విషయాలను వెల్లడించారు. వాట్సాప్ గ్రూపుల్లో ఇబ్బందికరమైన పోస్టులు పెట్టడం, ఫార్వర్డ్ చేయడం నేరమన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులపై సైబర్ క్రైమ్ విభాగం నిఘా ఉందన్నారు. కులాలు, మతాల పేరుతో ఓట్లు అడగడం నేరమని చెప్పారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు.

జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



పోలవరంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: సంక్షేమ అభివృద్ధి ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. శనివారం చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ఒక్క జగన్‌కే దక్కిందని చెప్పారు. పథకాలు సక్రమంగా అందాలంటే ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. టీడీపీ హయాంలో టీడీపీ కార్యకర్తలకే పథకాలు దక్కాయని, జగన్ ప్రభుత్వంలో అన్ని పార్టీల వారికీ పథకాలు అందాయని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో పెన్షన్ల కోసం లబ్ధిదారులు చెట్ల కింద రోజుల తరబడి వేచి ఉండేవారని, నేడు ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామున పింఛన్ అందుకుంటున్నారని చెప్పారు. నిరుపేదలకు స్థలం ఇచ్చి ఇల్లు కట్టిచ్చారని, నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారని వివరించారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలని ఆయన ప్రజలను కోరారు. పోలవరం గ్రామంలో నాలుగున్నరేళ్లలో ప్రత్యక్షంగా రూ.20.61 కోట్ల లబ్ధి సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు అందిందని, పరోక్షంగా సుమారు రూ.5 కోట్ల లబ్ధి పొందారని, నాలుగు లే అవుట్లలో 233 మందికి ఇంటి స్థలాలు ఇచ్చామని వివరించారు. కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ సత్తెనపల్లి లక్ష్మి, చెలికాని బాబ్జీ, ఎంపీటీసీ వేముల చిన వెంకటేశ్వరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చల్లగుళ్ల జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటుదారులను తరిమి కొట్టండి

వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు

జి.కొండూరు: రాజకీయ భిక్షపెట్టిన వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి మరో పార్టీతో కలిసి వస్తున్న వసంత వెంకటకృష్ణప్రసాద్‌ని ఓటు అనే ఆయుధంతో నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని కుంటముక్కల, గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు గ్రామాలలో పార్టీ శ్రేణులతో సర్నాల తిరుపతిరావు ఆత్మీయ సమావేశాలను శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాలలో పార్టీ శ్రేణుల నుంచి తిరుపతిరావుకి ఘన స్వాగతం లభించింది. ముఖ్యంగా గంగినేని గ్రామంలో గొర్రె పొటేళ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బండిపై తిరుపతిరావును ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గంగినేని గ్రామంలో తిరుపతిరావు మాట్లాడుతూ వసంత వెంకట కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. డబ్బు అహంకారంతో విర్రవీగుతున్న వసంత వెంకట కృష్ణప్రసాద్‌కి పేదోడి దెబ్బ ఎలా ఉంటుందో ఈ ఎన్నికల్లో రుచి చూస్తారని చెప్పారు. జగనన్న ప్రభంజనంతో గెలుపొంది ఐదేళ్లు ఎమ్మెల్యేగా అన్ని భోగాలు అనుభవించిన వసంత వెంకట కృష్ణప్రసాద్, చంద్రబాబును పొగడటం చూస్తే జోగి జోగీ రాసుకున్నట్టుందన్నారు. మన దగ్గర డబ్బులుంటే ఓట్లు రాలవని, ప్రజల ఓట్లను పొందాలంటే ప్రేమ, అభిమానం, విశ్వసనీయత అవసరమని చెప్పారు. మైలవరం నియోజకవర్గానికి నీరు ఏ దిక్కు నుంచి వస్తుందో తెలియని వసంత, పులిచింతల, పట్టిసీమ, రిజర్వాయర్లు అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రానికి ఏమీ చేయని చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని వసంత చెప్పడం తన స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఓటమి భయంతోనే వసంత వెంకటకృష్ణప్రసాద్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మైలవరం గడ్డపై వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



కుంటముక్కల గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు

కూటమి కుట్రలను తిప్పికొట్టేందుకు 'సిద్ధం' కావాలి

- వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు
- నల్లకుంట, గొల్లపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టేందుకు 'సిద్ధం' కావాలని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లకుంట, గొల్లపూడి గ్రామంలోని అంబేడ్కర్ నగర్‌లలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అర్హులైన చివరి వ్యక్తి వరకు సంక్షేమ పథకాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు పాలనకు, సీఎం జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పారదర్శక పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పరిశీలిస్తే మీకే అర్థమవుతుందని ప్రజలకు వివరించారు.



స్థానికులతో మాట్లాడుతున్న తిరుపతిరావు

ఒక్కడిని ఎదుర్కొనేందుకు కూటమి కట్టారు

విలువలు, విశ్వసనీయతతో సుపరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడిని ఎదుర్కొనేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కట్టిందని, అంటే జగనన్నకు ఉన్న ప్రజాబలం స్పష్టం అవుతుందని సర్నాల తిరుపతిరావు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలద్వారా దాదాపు 80 శాతానికిపైగా ప్రజలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అందుకే తాము ధైర్యంగా ప్రజల ముంగిటకు వెళ్లి ఓట్లు అభ్యర్థించ గలుగుతున్నామని, కాని తన ప్రభుత్వంలో ప్రజలకు ఏం మేలు చేశాడని చంద్రబాబు ఓట్లు అడుగుతాడని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి పొత్తు చిత్తుకాక తప్పదన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి, నల్లకుంట గ్రామ వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

దళితులను అగౌరవంగా మాట్లాడితే సహించం

కాకి జోజిబాబు, మందా నోవా



మాట్లాడుతున్న కాకి జోజిబాబు, మందా నోవా, ప్రశాంతి తదితరులు

మైలవరం: దళితుల పట్ల చంద్రబాబు అగౌరవంగా మాట్లాడితే సహించేది లేదని ఎస్సీ సెల్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి జోజిబాబు, కార్యదర్శి మందా నోవా హెచ్చరించారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీలను కించపర్చే విధంగా మాట్లాడుతున్న చంద్రబాబును 2024 ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపడం ఖాయమన్నారు. టీడీపీ ప్రచార సభలో శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థి వీరాంజనేయులుపై ఆటో డ్రైవర్, టిప్పర్ డ్రైవర్ అంటూ చంద్రబాబు వ్యంగ్యంగా మాట్లాడటం చూస్తే ఆయనకు దళితుల పట్ల ఉన్న చులకన భావన అర్థమవుతోందన్నారు. వైఎస్సార్ సీపీకి అభ్యర్థులు లేరని, అందుకే జగన్ డ్రైవర్‌లుగా పనిచేస్తున్న వారికి సీట్లు ఇస్తున్నాడని చెప్పడం చంద్రబాబు కుసంస్కారాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. గతంలో కూడా ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబు అనడం ఎస్సీల పట్ల ఆయనకు ఉన్న చులకన భావాన్ని తెలియజేస్తోందన్నారు. చంద్రబాబు తన పాలనలో అణగారిన వర్గాలను చిన్నచూపు చూశారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే ఎస్సీ, ఎస్టీ, బీసీలు, బలహీన వర్గాలకు గుర్తింపు లభిస్తోందన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ సెక్రటరీ నల్ల మోతు చిన్నయ్య, చాట్ల అజయ్, బుర్రి ప్రతాప్, ప్రశాంతి, కంభంపాటి ఏసుబాబు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు పునరుత్థాన శాంతిర్యాలీ

ఇబ్రహీంపట్నం: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ఏసుక్రీస్తు పునరుత్థాన శాంతి ర్యాలీ మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో శనివారం జరిగింది. ప్రపంచంలో అనేక మంది మరణించినప్పటికీ చనిపోయి మూడో రోజు సమాధి నుంచి తిరిగి లేచినది ఏసుక్రీస్తు మాత్రమే అని ర్యాలీ ద్వారా పలువురు పాస్టర్లు తెలిపారు. పాస్టర్ ఏలీషా మాట్లాడుతూ సమాధి నుంచి సజీవంగా మూడో రోజు ఏసుక్రీస్తు లేచిన పవిత్ర ఈస్టర్ పండుగ ప్రతి క్రైస్తవుడు భక్తిశ్రద్ధలతో ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఫెలోషిప్ అధ్యక్షుడు ప్రభుదాస్, కార్యదర్శి ఇస్సాక్, కోశాధికారి శుభాకరరావు, పాస్టర్స్ శామ్యూల్, మోజెస్, రాజేంద్రప్రసాద్, అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.



ఏసుక్రీస్తు పునరుత్థాన శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

అభివృద్ధిపై వసంత వ్యాఖ్యలు అవివేకం

సర్నాల తిరుపతిరావు, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి

మైలవరం: రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పదేపదే మాట్లాడటం అవివేకమని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మైలవరం నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గత నాలుగున్నరేళ్లుగా పలు శంకుస్థాపనలు, ప్రారంభం తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ఇప్పుడు పార్టీ మారి రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని చెప్పడం ఏరు దాటిన తరువాత తెప్ప తగలబెట్టిన చందాన ఉందన్నారు. మైలవరం నియోజకవర్గంలో పలు గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు ప్రారంభించిన విషయం అప్పుడే మర్చిపోయారా అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయి, ఫ్యామిలీ డాక్టర్ పథకంతో ప్రతి గ్రామంలో వైద్యం, ఉచితంగా మందులు అందజేయడం ద్వారా లబ్ధిదారులకు డబ్బు ఆదా, సమయం కలిసి రావడం కన్పించడం లేదా అని ప్రశ్నించారు. పారిశ్రామికవేత్తవి రాష్ట్రంలో శరవేగంగా నిర్మిస్తున్న పోర్టులు కన్పించడం లేదా అని, మెడికల్ కళాశాలలు నిర్మాణం కన్పించడం లేదా అని అన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రుల్లో సౌకర్యాలు పెంచి మెరుగైన వైద్యం అందించడం, అక్షరాస్యతలో నంబర్ వన్‌గా ఉన్న కేరళ రాష్ట్రాన్ని అధిగమించిన విషయం మీకు తెలియకపోవచ్చన్నారు. వైఎస్సార్ ప్రభుత్వంపై బురద జల్లి తద్వారా లబ్ధి పొందాలని అనుకోవడం మీ అవివేకమన్నారు. సామాన్యుడిని ఎమ్మెల్యేగా గెలిపించడానికి నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారని, పెత్తందారీ పోకడలు మానుకోవాలని హితవు పలికారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలోని శ్రీపాటిమీద ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం జీర్ణావస్థకు చేరడంతో దాతల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు తెలిపారు. వేదపండితులు శాస్త్రోక్తంగా నూతన ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఆలయ అర్చకులు రామకృష్ణ, శ్రీనివాస్ విశేషపూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అభివృద్ధి ప్రదాతకు అండగా నిలుద్దాం

ఆగిరిపల్లి: సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపి కోరారు. శనివారం ఆగిరిపల్లి 11వ వార్డులో ఇంటింటికి వెళ్లి నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావుని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నక్కన బోయిన పండు, గ్రామ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ వాకాసకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీమాఫీ

నూజివీడు: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయి మొత్తాన్ని ఈనెల 31వ తేదీలోగా చెల్లించి వడ్డీ మాఫీ పొందాలని మున్సిపల్ కమిషనర్ రొద్దం వెంకట రామిరెడ్డి పేర్కొన్నారు. పన్నులను కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో లేదా ఆన్‌లైన్ లేదా బ్యాంకింగ్ లేదా యూపీఐ ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

అవకాశవాదులను నమ్మొద్దు

తిరువూరు: ఎన్నికల సమయంలో వచ్చి హడావుడి చేసి వెళ్లిపోయే అవకాశవాదులను నమ్మవద్దని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి ఓటర్లను కోరారు. తిరువూరు నగర పంచాయతీలోని 12వ వార్డులో శనివారం సాయంత్రం ఆమె వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. తిరువూరు నియోజకవర్గ ఎల్లలు తెలియని వారు ఇక్కడి ప్రజలకు మేలు చేస్తామంటూ ఎన్నికల్లో నిలబడ్డారని, స్వామిదాసు 30ఏళ్లుగా తిరువూరులోనే స్థిరనివాసమేర్పరచుకుని ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారని చెప్పారు. స్థానిక సమస్యలు, పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న స్వామిదాసును గెలిపిస్తే సత్వరం పరిష్కారం చేసుకోవచ్చని చెప్పారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్మన్ వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



తిరువూరు 12వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న సుధారాణి

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి

తిరువూరు: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే తమకు ఫిర్యాదు చేయాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి, రిటర్నింగ్ అధికారి కె. మాధవి అన్నారు. తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ నంబర్ 08673-251235కు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఘనంగా రామాలయ ప్రతిష్ఠ

చాట్రాయి: మండలంలోని కోటపాడు గ్రామంలో కోదండ రామాలయ ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8.10 గంటలకు వేద పండితుల వేద మంత్రాల నడుమ సీతారాముల విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా 10వేల మందికి అన్నదానం చేశా రు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ పరసా సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు.

తామర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

మైలవరం: వాతావరణంలో అనూహ్య మార్పులు, పూత దశలో తామర పురుగు ఉధృతి తదితర కారణాల వలన ఈ ఏడాది మామిడి దిగుబడి ఆశించిన స్థాయిలో లేదని నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ జి. శాలిరాజు అన్నారు. మైలవరం, జి.కొండూరు మండలాల్లోని గణపవరం, వెల్లటూరు, కోడూరు గ్రామాల్లోని మామిడి తోటలను మైలవరం మండలం ఇన్‌చార్జి ఉద్యాన శాఖాధికారి సొహైల్ అహ్మద్, స్థానిక రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. సమగ్ర యాజమాన్యం, నీటి, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఉద్యాన శాఖ ఇన్‌చార్జి అధికారి సొహైల్ అహ్మద్, గ్రామ ఉద్యాన సహాయకులు దేవి, బి. మహేష్, సాయి, రైతులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

మైలవరం: క్రీస్తు బోధనలు ఆచరణీయమని రన్ ఫర్ జీసస్ ఏరియా కో-ఆర్డినేటర్ రెవరెండ్ మణిబాబు అన్నారు. మైలవరంలో పాస్టర్స్, సంఘాల సహకారంతో ఏసే నిజ రక్షకుడు నినాదంతో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం సెంటర్, నూజివీడు రోడ్డు, బైపాస్ రోడ్డు మీదుగా వీవీఆర్ కళాశాల వరకు ర్యాలీ జరిగింది. ఏసుక్రీస్తు పాపుల రక్షణ కొరకు సిలువ మరణం పొంది మూడో రోజు పునరుజ్జీవుడయ్యారని వివరించారు. క్రీస్తు బోధనలు వివరించారు. కార్యక్రమంలో బ్రదర్ తిమోతి, విశ్వాసులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విశ్వాసులు

ముమ్మరంగా వాహనాల తనిఖీ

ముసునూరు: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లు, చెక్‌పోస్టులు, వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, జిల్లా డెప్యూటీ లేబర్ కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలోని బృందం ముసునూరు, కాట్రేనిపాడు కూడళ్లు, వలసపల్లిలోని అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద పలు వాహనాలను తనిఖీ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై నిఘా పెట్టామన్నారు. సూరేపల్లి గ్రామం వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 49 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

నెమలి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి ఆలయ హుండీ కానుకలను శనివారం లెక్కించారు. ఇటీవల ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆలయంలోని తొమ్మిది హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను ఈ విడత లెక్కించారు. మొత్తం రూ. 11.05 లక్షల ఆదాయం లభించిందని సహాయ కమిషనర్ వెంకట సాంబశివరావు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అనుముల్లంక/కనుమూరు(గంపలగూడెం): వాతావరణంలో అనూహ్య మార్పు, పూత దశలో నల్లతామర పురుగు ఆశించడంతో ఈ ఏడాది మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిందని నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శాలిరాజు తెలిపారు. శనివారం ఆయన గంపలగూడెం మండలం కనుమూరు, అనుముల్లంక గ్రామాలలో మామిడి రైతులతో కలిసి తోటలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం కాయ పెరిగే దశలో ఆశించిన కాయపుచ్చు, పండు ఈగలను నివారణ చర్యలు, తీసుకోవలసిన నీటి, ఎరువుల యాజమాన్యం పద్ధతులను ఆయన సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ తిరువూరు మండల శాఖకు నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవర అధ్యక్షుడిగా బల్లిపర విజయప్రసాదరావు, అసోసియేట్ అధ్యక్షులుగా యూపీ శేషారావు, ఎండీ కమృద్దీన్, ప్రధాన కార్యదర్శిగా పత్తిపాటి మార్కు, కోశాధికారిగా అయినాల వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.